ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 ఆగస్టు 2024



మున్నంగి నుంచి ఐదు కిలోమీటర్ల మేర కరకట్టపై ఇసుక కోసం బారులు తీరిన లారీలు

ఇసుక సీరియల్.. చీటీ రూ. 2500

డబ్బు, మద్యం సీసా ఇస్తారా ! అయితే మీకు వెంటనే ఇసుక లోడ్ అయిపోతుంది. ఇవేమీ ఇచ్చుకోలేమంటారా!... మూడు నుంచి నాలుగు రోజులు కరకట్టపై పడిగాపులు పడాల్సిందే. ప్రభుత్వం ఇస్తున్నది ఉచిత ఇసుకే కదా! ఇట్టే లోడ్ చేయించుకుని ఇంటికి పట్టుకెళ్లిపోవచ్చని లారీ తీసుకుని వెళితే మీకు చుక్కలు కనిపించాల్సిందే. దళారులు, సిబ్బంది కుమ్మక్కయి ఉచిత ఇసుక నుంచి తైలం పిండేస్తున్నారు. ఇసుక రీచ్‌లన్నీ లేకపోవటం, ఇసుక గుట్టలకే అనుమతి ఇవ్వటంతో, అవి ఉన్న నాలుగైదు చోట్ల దళారులు, సిబ్బంది కలసి వినియోగదారులను నిలువునా దోచేస్తున్నారు. ప్రభుత్వం నిర్మాణదారులకు ఇసుకను ఉచితంగా ఇద్దామని ప్రతిష్ఠాత్మక నిర్ణయం తీసుకుని, కేవలం లోడింగ్ ఖర్చులు మాత్రమే చెల్లించి ఇసుక తీసుకువెళ్లొచ్చని ప్రకటిస్తే, చివరకు ఇసుక కొన్నంత రేటుకు రెట్టింపు వసూళ్లతో వినియోగదారుడికి 'ఉచిత' ఇసుక గుప్పెడు కూడా దొరకనివ్వటంలేదు. ప్రభుత్వం చెప్పిన పద్ధతి ప్రకారం ఇసుక కోసం వెళ్లి ఒక లారీ ఇసుక తెచ్చుకోవాలంటే కనీసం మూడు నుంచి ఐదు రోజులు కరకట్టపై పడిగాపులు పడాల్సిన దయనీయ పరిస్థితి.

- ఇసుక సీరియల్ నంబర్లు నల్లబజార్‌లో
- లోడింగ్ దగ్గర దళారులు, సిబ్బందిదే రాజ్యం
- డబ్బు, మద్యానికి సీరియల్ చీటీల అమ్మకం
- అధికారులు, విలేకరులకు వాటాలివ్వాలట...
- అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి సిబ్బందే బరితెగింపు
- ఒక్కో చీటీ రూ. 1500 నుంచి రూ. 2,500
- డబ్బిస్తే వెంటనే లోడింగ్... మందు బాటిలిస్తే అదే రోజు ఇంకో లోడ్
- లేకుంటే నాలుగు రోజులకో లోడ్
- మున్నంగిలో బరితెగింపు...

తెనాలి, ఆగస్టు 1, (ఆంధ్రజ్యోతి): ఒక లారీ ఇసుక కావాలంటే ప్రభుత్వం రూ. 2,500 చెల్లించాలని కూలి రేటు నిర్ణయిస్తే, అంతే మొత్తం సిబ్బందికి సమర్పించుకుంటే కానీ ఇసుక లోడ్ కాని పరిస్థితి. ట్రాక్టర్‌కు మినహా 6 చక్రాల లారీకి సీరియల్ నంబర్ వెంటనే కావాలంటే రూ. 1500, పది చక్రాల లారీకి సీరియల్ స్లిప్ కావాలంటే రూ. 2,500 చెల్లించాల్సిందే. లేకుంటే లారీ లోపలికి దిగదు. కొల్లిపర మండలం మున్నంగిలో ఇదేతరహా బరితెగింపు రాజ్యమేలుతోంది. అదేమని అడిగితే పాత సీరియల్ ఇంకా కాలేదంటూ వరుసలో ఉన్న లారీలను వరుసలోనే నిలబెట్టి వారికి డబ్బిచ్చిన లారీలను ఒక్క గంటకూడా నిలవనివ్వకుండా ఒక్క రోజులోనే ఒకటి నుంచి మూడు లోడుల ఇసుక ఇప్పించేస్తున్న పరిస్థితి. గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కొల్లిపర మండలం వస్తుండటంతో ఎక్కడ ఇసుక రీచ్‌కు వస్తారో! ఏ తనిఖీలు చేసి ఎక్కడ చర్యలకు దిగుతారోనన్న భయంతో మధ్యాహ్నం 12 గంటల లోపే 90 లారీలకు లోడ్ చేసి పంపేయటం విశేషం. ఆదివారం నుంచి ఇసుక కోసం పడిగాపులు కాస్తున్నవారికి ఉపశమనం లభించిందంటే, కచ్చితంగా ఇసుక సీరియల్ నంబర్‌ల ప్రకారం రోజూ లోపలికి అనుమతిస్తే రోజుల తరబడి లారీలు నిలిచి ఉండాల్సిన పని ఉండదు. లోపల ఏం జరుగుతుందనేది బహిరంగ రహస్యమే అయినా, లోపం మాత్రం సరిచేసేవారు కరువయ్యారు. దీంతో ప్రభుత్వం ఉచితంగా వినియోగదారునికి ఇసుక ఇద్దామన్నా మధ్య దళారులు దానిని ఆచరణలో అమలు కానివ్వకుండా అప్రతిష్ఠతెచ్చే ప్రయత్నాలు బహిరంగంగానే చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం ఘనం... ఆచరణే అమ్యామ్యాల మయం

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నట్టు ఆదేశాలిచ్చాక ముందుగా గత ప్రభుత్వ కాలంలో అక్రమంగా ఒడ్డున నిల్వ ఉంచిన భారీ ఇసుక గుట్టలను ఇచ్చేందుకు అనుమతులిచ్చారు. ప్రకాశం బ్యారేజి దిగువన మున్నంగి, కొల్లిపరలోనే అవకాశం ఉంటే, ఎగువన మాత్రం లింగాయపాలెం, తాళ్లాయపాలెం, వైకుంఠపురం దగ్గర ఇసుక గుట్టలకు అనుమతి ఇచ్చారు. దీనికోసం రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఎంపీడీఓ, సచివాలయ సిబ్బందిని ఒక్కో చోట 20 మందికిపైగా సిబ్బందిని ఏర్పాటుచేసి మరీ వినియోగదారునికి అసౌకర్యం కలగకుండా ఇచ్చేందుకు ప్రభుత్వం పగడ్బందీ ఏర్పాట్లే చేసింది. ఇసుక లోడ్ కూడా గత ప్రభుత్వ కాలంలో ఓవర్ లోడ్‌లా కాకుండా, ట్రాక్టర్‌కు 5 టన్నులు, ఆరు చక్రాల లారీలకు 10 టన్నులు, పది చక్రాల లారీలకు 20 టన్నుల ఇసుక లోడ్‌కు అనుమతినిచ్చారు. అయితే ఒక్కో రీచ్ దగ్గర లారీలు బారులు తీరితే ఏ రోజుకారోజు నిలిపి ఉన్న లారీల దగ్గరకే అధికారులు వెళ్లి సీరియల్ నంబర్ వేసి ఇవ్వటం, దాని ప్రకారమే లోనికి అనుమతించి, లోడింగ్ చార్జీల చెల్లింపులు చేయించటం ఒక క్రమ పద్ధతిలోనే జరిగిపోయాయి. అయితే వీటిలో రీచ్‌లున్న ప్రాంతాల్లో స్థానిక నేతలకు ఒత్తిడులు రావటంతో కొన్ని లారీలకు సీరియల్‌తో పనిలేకుండా ప్రయారిటీ పేరుతో ఎప్పుడు లారీ వచ్చినా వరుసలో ఆగకుండా నేరుగా లోడింగ్‌కు వెళ్లేలా సిఫార్సులు చేయించారు. ఈ అవకాశం వచ్చిందోలేదో వెంటనే దళారులు పుట్టుకొచ్చేశారు. వారు సిబ్బందితో కుమ్మక్కయిపోయి నాయకుల పేర్లు చెప్పి చీటీల అమ్మకానికి బరితెగించేశారు. నేతలు చెప్పిన లారీలు పదుల సంఖ్యలో ఉంటే, వీరు మాత్రం వందల సంఖ్యలో అక్రమ పద్ధతిలో లారీలకు అదనపు వసూళ్లచేసిమరీ ఇసుక ఇప్పించేస్తున్నారు.

నేతలు.. అధికారులు.. విలేకరులకు వాటాలని చెప్పి..

సీరియల్ తప్పించి వారికిష్టమొచ్చిన లారీలకు ఒకటికి మించి ఇసుక లోడ్‌కు అవకాశం కల్పిస్తూ ఒక్కో ట్రిప్‌కు రూ. 2,500 వసూలు చేస్తున్నారు. అంటే ఒకలారీ ఆ రోజులో మూడు ట్రిప్‌లు వేసిందనుకుంటే ఆ లారీనుంచే రూ. 7,500 వసూలు చేస్తున్నట్టు. ఇట్లా రోజుకు 60 నుంచి 80 లారీల వరకు అవకాశం ఇస్తున్నారు. అంటే ఎంత భారీ మొత్తంలో దళారులు, సిబ్బంది కలసి చేతివాటం చూపించి నేతల పేర్లు ఉపయోగించుకుని దోచేస్తున్నారనేది అర్థమవుతుంది. పోనీ లోడింగ్ పెద్దగా కావటంలేదా! అంటే అదీలేదు. రోజుకు 200 నుంచి 280 వరకు లారీలకు లోడ్ చేసేస్తున్నారు. మున్నంగి-వల్లభాపురం మధ్య అటు, ఇటు ఐదు నుంచి ఆరు కిలోమీటర్లమేర లారీలు కరకట్టకు ఇరువైపులా ఆగిపోయి ఉంటున్నాయి. దీనికి తోడు కట్టకు అంచున నిలువుగా నిలపకుండా సీరియల్ తప్పించేసి ఎప్పుడు కావాలంటే అప్పుడు గుట్టల దగ్గరకు వెళ్లే లారీలు ముందుభాగం కరకట్టపైకి ఉండేలా పెడుతుండటంతో కరకట్ట సగంపైగా ఆక్రమించేస్తున్నాయి. ఇదే పరిస్థితి రెండుపక్కల ఉండటంతో రేపల్లె-విజయవాడ బస్సు వెళ్లటానికి, చివరకు కార్లు వెళ్లటానికి కూడా గంటకొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అయితే బిల్లుల దగ్గర ఇద్దరు, ముగ్గురు పోలీస్ సిబ్బంది ఉంటున్నా వారిలో ఒకరిద్దరు పోలీసులు మాత్రం దొంగ స్లిప్‌లు ఎవరు తీసుకుంటున్నారో చూసుకుని, వారిదగ్గర నుంచి వాటాలు రాబట్టుకునే పనికే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శ ఉంది. వీరు కనీసం లారీలు అడ్డదిడ్డంగా పెడుతున్నా వాటిని వారించకుండా, క్రమ పద్ధతిలో పెట్టించకుండా వదిలేస్తుండటంతో సమస్య మరింత జటిలమవుతోంది. నేరుగా లారీలు తీసుకవెళ్లిన వినియోదగారులే అదంతా చూడలేక అదేమని ప్రశ్నిస్తే ఈ మొత్తం వాటాలు మాకొక్కరికే కాదని, ఒక్కో స్లిప్‌కు వచ్చిన డబ్బు నేతలకు, మాపై అధికారులకు, చివరకు విలేకరులకు కూడా ఇవ్వాల్సిందేనని, మొత్తం మేము తినటంలేదని బహిరంగంగానే చెప్పటం వీరి బరితెగింపునకు నిదర్శనం.

ఉచితంగా అందాల్సిన ఇసుకకు..

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకొస్తే, నామమాత్రపు కూలి రేట్లు మినహా రీచ్ దగ్గర పెద్దగా ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. కానీ ఇక్కడ జరుగుతున్న లోపాలతో ఉచితం మాట అటుంచితే, అసలు చెల్లించాల్సిన ఛార్జీలకంటే మూడు నుంచి ఐదు రెట్లు అదనంగా చెల్లించుకోవలసిన దయనీయ పరిస్థితి. ఉదాహరణకు తెనాలికి చెందిన ఒకరు, నారాకోడూరు, సంగంజాగర్లమూడికి చెందిన మరో ఇద్దరు మూడు లారీలు తీసుకుని ఇసుక కోసం ఆదివారం మున్నంగి రీచ్‌కు వెళితే, వారికి 74,78,79 సీరియల్ నంబర్‌లిచ్చారు. ఆ రోజు లోడ్ కాకపోవటంతో సోమవారం తమ సీరియల్ వచ్చిందేమోనని చూసుకుంటే ఇంకా 22వ సీరియల్ నడుస్తున్నట్టు చూపించారు. వారికి అనుమానం వచ్చి సోమవారం మొత్తం లోడయిన వాహనాలను లెక్కిస్తే లారీలు, ట్రాక్టర్లు మొత్తం 256 ఉన్నట్టు తేలింది. అయితే తర్వాత రోజు కూడా తమ సీరియల్ కాకపోవటం, మూడో రోజు ఏకంగా 112 నంబర్ కనిపించటంతో అదేమని అడిగితే మీకన్నా ముందు ఇచ్చిన సీరియల్ ఇంకా కాలేదని సిబ్బంది బుకాయించటం కొసమెరుపు. నాలుగు రోజులు గడిచినా వారి లారీలకు సీరియల్ మాత్రం అందలేదు. దీంతో రోజుకు డ్రైవర్‌కు రూ. వెయ్యి చొప్పున ఒక్కో లారీకి రూ. 4వేలు చెల్లించుకున్నారు. గురువారం ఎట్టకేలకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ పర్యటన పుణ్యమా అని వారికి ఐదో రోజు లోడ్ లభించింది. లోడ్ కోసం రూ. 5వేలు చెల్లిస్తే, డ్రైవర్ ఖర్చులు, కొనుగోలు కలిపి లారీకి రూ. 9 వేల ఖర్చు. ఇదికాక రవాణా ఛార్జీలు కూడా కలిపితే వారి ఇంటికి లారీ ఇసుక చేరటానికి రూ. 12వేలపైనే ఖర్చయింది. అంటే గతంలో ఇసుక కొనుగోలు సమయంలో చేసినంత ఖర్చే ఇప్పుడు చెయ్యాల్సిన పరిస్థితి. పోనీ ఇవన్నీ కాకుండా నల్ల బజార్‌లోనే చీటీలు కొనుక్కుని ఇసుక తీసుకువెళ్లినా లారీ ఇసుక రూ. 5వేలు, సీరియల్ చీటీ ఖరీదు రూ. 2,500, రవాణా ఛార్జీలు కలిపి రూ. 10,500పైనే వినియోగదారునికి పడుతోంది. ఇంత భారం పడటానికి కారణం ఏమంటే లోపమంతా దళారులు, సిబ్బంది దగ్గరే. దీనిని పర్యవేక్షించాల్సిన అధికారులుకూడా పట్టించుకోకపోవటం, ఎవరైనా ప్రశ్నిస్తే, నేతల పేరుచెప్పి వారి సిఫార్సుల వల్ల తప్పటంలేదని సిబ్బంది తప్పించుకుంటున్న పరిస్థితులూ ఉన్నాయి.

సీరియల్ చీటీలు... డబ్బు, మద్యానికి అమ్మకం

ఒక ట్రాక్టర్ ఇసుకకు మున్నంగి వంటి రీచ్‌లలో టన్నుకు రూ. 250 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన కూలి రేట్ల ప్రకారం రూ. 1250 చెల్లించాలి. 6 చక్రాల లారీలకు రూ. 2,500 చెల్లించాలి. 10 చక్రాల లారీలకు రూ. 5వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రేట్ల ప్రకారం వినియోగదారుడు చెల్లిస్తే ఇసుక తీసుకువెళ్లొచ్చు. అయితే ఇక్కడ దీనిప్రకారం జరగటంలేదు. ఇక్కడ దళారులదే ఇష్టారాజ్యం. సిబ్బందికీ వాటాలు అందుతుండటంతో వారు చెప్పినవారికి స్లిప్‌లు ఇచ్చేస్తున్నారు. ఇసుక అనుమతిచ్చిన మొదట్లో ఆగిన లారీల దగ్గరకే సిబ్బంది వెళ్లి సీరియల్ నంబర్‌తోపాటు బిల్‌కూడా ఇచ్చేసేవారు. ఆ సీరియల్ ప్రకారం లారీలను పోలీసులు లోపలకు అనుమతిస్తే, లోపలకు వెళ్లాక ఆన్‌లైన్ విధానంలో డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఆ డబ్బు కట్టేశాక లోడింగ్ దగ్గర ఇసుక లారీలకు నింపుతారు. అయితే ఇసుక కొరత, డిమాండ్ ఎక్కువ కావటంతో దళారులు, సిబ్బంది కుమ్మక్కయి ఇసుక స్లిప్‌లను అమ్మేస్తున్నారు. లారీల దగ్గరకు వెళ్లకుండా ముందుగానే దళారులకు ఒక్కొక్కరికి పది నుంచి 20 స్లిప్‌లు సీరియల్ నంబర్ వేసి ఇచ్చేయటం పరిపాటిగా మారిపోయింది. మరో విశేషమేమంటే ఆ సీరియల్ నంబర్ లున్న స్లిప్ తీసుకునేవారికి అసలు లారీకూడా వెంట ఉండకపోవటమే. ఒక్కమాటలో చెప్పాలంటే వీరికి ఇసుకే అవసరం ఉండదు. కేవలం నల్లబజార్‌లో స్లిప్‌లను అమ్మేందుకు వారు సిద్ధమవుతున్నారు.

మంత్రి మనోహర్ వస్తున్నారని..

వారం నుంచి ఇసుక లోడ్ కాకుండా ఉన్న లారీలు, కిలోమీటర్ల పొడవున నిలిచిన లారీలకు గురువారం మధ్యాహ్నం లోపే ఇసుక లోడింగ్ జరిగిపోయింది. ఎవరినీ బ్రతిమాలకుండా, సీరియల్ కోసం బారులుతీరి నిలబడాల్సిన పనిలేకుండా అంతా మాయ జరిగినట్టు జరిగిపోయింది. రోజులతరబడి నిరీక్షించినవారికి ఏం జరుగుతుందో! సిబ్బందిలో ఇంత చిత్తశుద్ధి ఎందుకు వచ్చిందో చాలా సేపు అర్థంకాలేదు. తీరా ఏంటాఅని ఆరాతీస్తే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పెన్షన్‌ల పంపిణీ కోసం కొల్లిపర మండలంలో పర్యటించనుండటమేనని తెలిసి ఇసుక వినియోగదారులు సంతోషపడిపోయారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపే 90 లారీలకు లోడింగ్ అయిపోయిందంటే, అదికూడా సీరియల్ ప్రకారం జరిగిందంటే ఆశ్చర్యమే. అంటే అంతా సక్రమంగా జరిగితే ఒక్క లారీ కూడా ఒక పూటకు మించి నిరీక్షించాల్సిన పనిలేదన్నమాట. మనోహర్ గతంలో కొల్లిపర ఇసుక గుట్టల దగ్గర ఆకస్మిక తనిఖీలు చేసి లోపాలపై అధికారులపై మండిపడటం, మరోసారి జరిగితే ఉపేక్షించమని, చర్యలు తప్పవని హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే గురువారం కూడా ఆయన కొల్లిపర వచ్చిన సందర్భంలో ఆకస్మికంగా తనిఖీ చేస్తారేమోనని సిబ్బందే బిల్లుల పాకల దగ్గర కూర్చోకుండా లారీల దగ్గరకే వచ్చి సీరియల్ నంబర్ ఇవ్వటం, ఇచ్చిన లారీల ఫోటోలు బిల్లింగ్ సిబ్బందికి పెట్టటం వంటివి చేసేశారు. అటు పోలీసులు కూడా అన్నీ సక్రమమైన పద్ధతిలో తీసుకొచ్చారు. అంటే లోపం లోడింగ్‌లో కాదని, సిబ్బంది, దళారుల పాత్రపైనే ఆధారపడిఉందనేది దీనిద్వారా అర్థమవుతున్న విషయమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తారో! లేదో చూడాలి.



సీరియల్ నంబర్ వేసి, బిల్ ఇచ్చే క్యాబిన్ వద్ద ఒకవైపు వరుసలో బిల్‌కోసం బారులు తీరితే, మరో కిటికీ దగ్గర దళారులిచ్చిన స్లిప్‌లకు బిల్లులు తీసుకునేందుకు గుమికూడిన చిత్రం

మున్నంగిలోనే ఎందుకు కట్టడి కావటం లేదో! నేతలకే ఎరుక. గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని లారీలే కాకుండా ఇక్కడికి కృష్ణా జిల్లా లారీలు భారీగానే వచ్చి చేరుతున్నాయి. కృష్ణా జిల్లాలో కీసర దగ్గర ఇసుక ఉన్నా, వారికి మున్నంగి దగ్గర కావటంతో వచ్చేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉండే లారీలకు 50 మందికి స్లిప్‌లు ఇస్తుంటే, అటు కృష్ణా జిల్లా లారీలకూ మరో 50 ఇస్తున్నారు. దీంతో రద్దీ కూడా పెరిగిపోతోంది. గతంలో సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ రీచ్ దగ్గర పరిశీలించినప్పుడు స్థానిక లారీల యజమానులు కృష్ణా జిల్లా లారీల విషయం చెప్పటంతో వాటిని ప్రోత్సహించవద్దని ఆదేశాలిచ్చారు కూడా. అయితే అటు నుంచి వచ్చిన లారీలు స్థానిక లారీల కంటే మరో రూ. 500 అదనంగా ఇస్తుండటంతో దళారులు, సిబ్బంది వారి కి అవకాశం ఇస్తున్నారు. పైగా వారు కృష్ణా జిల్లా నుంచి కాకుండా గుంటూరు జిల్లా నుంచే వచ్చామని చెప్పించిమరీ ఇసుక తీసుకెళ్తున్నారు. దీంతో రద్దీ మరింత పెరిగిపోతోంది.

ఇదే పరిస్థితి గతంలో వైకుంఠపురం రీచ్ దగ్గర ఉంటే దానిని చాలావరకు సరిచేశారు. తాజాగా పెదకూరపాడు ఎమ్మెల్యేనే రంగంలోకి దిగి, ఇసుక విషయంలో ఎవరైనా దళారులు ఉంటే అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించిన పరిస్థితి ఉంది. దీంతో చాలావరకు ఇక్కడ రచ్చ సర్దుమణిగింది. అటు లింగాయపాలెంలోనూ వైసీపీ పాత నేతలు, ఎంపీ అనుచరులు మొదటి పది రోజుల్లో అడ్డదారుల్లో ఇసుక తరలించే ప్రయత్నం చేసినా, ప్రస్తుతం అక్కడ కూడా అంతా పగడ్బందీగానే సాగుతోందనేది లారీల యజమానులు, నిర్మాణదారుల మాట.



మంత్రి మనోహర్ వస్తుండటంతో బెంచిపైనే కూర్చుని సీరియల్ నంబర్, బిల్లులు ఇస్తున్న చిత్రం



కరకట్టపై అడ్డదిడ్డంగా పెట్టిన నేతలు, అధికారుల సిఫార్సులున్న వారి లారీలు



నదిలో కనుచూపు మేరలో ఇసుక లేకుండా తవ్వేసినా, గాలు మార్గంలో బారులను తలపిస్తున్న ట్రాక్టర్‌లు

పించన్ల పంపిణీలో ప్రభంజనం

- బట్వాడాలో కొత్త రికార్డులు
- ఉదయం 10 గంటలకే 95 శాతం పూర్తి
- తొలిరోజే 98 శాతం పూర్తయిన పంపిణీ

గుంటూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వలంటీర్లు లేకుంటే బ్రహ్మాండం బద్దలైపోతుంది.. వారు పంచకుంటే పింఛన్లు పంపిణీ చేయడం అసాధ్యం అంటూ గత వైసీపీ ప్రభుత్వం యాగీ చేసి రాష్ట్రంలో 40 మంది వయోవృద్ధులను పొట్టనబెట్టుకుంటే కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో కొత్త రికార్డులు సృష్టిస్తోంది. గురువారం ఉదయం 6 గంటలకే గుంటూ రు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పంపిణీ మొదలు పెట్టిన సచివాలయ ఉద్యోగులు ఉదయం పదిగంటలకల్లా 95 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసి రికార్డు సృష్టించా రు. గురువారం రాత్రికి 98 శాతం మందికి పింఛన్లు అందజేశారు.

● గుంటూరు జిల్లాలో 2లక్షల 57వేల 390 మంది పింఛనుదారులు వుండగా గురువారం సాయంత్రానికి వారిలో 97.8 శాతం మందికి, అంటే 2లక్షల 51వేల 326 మందికి 107 కోట్ల రూపాయల పింఛన్లు అందజేశారు. పల్నాడు జిల్లాలో 2లక్షల 78వేల 219 మంది పింఛనుదారులు వుండగా వారిలో 97.9 శాతం, అంటే 2లక్షల 64వేల 602 మందికి 116 కోట్ల రూపాయల పింఛన్లు అందజేశారు. బాపట్ల జిల్లాలో 2లక్షల 32 వేల 45 మంది పింఛనుదారులు వుండగా వారిలో 97.5 శాతం, అంటే 2లక్షల 25వేల 661 మందికి 93.92 కోట్ల రూపాయల పింఛన్లు అందజేశారు. తొలిరోజు 7.78 లక్షల మందికి గానూ 20 వేల మందికి మాత్రమే పింఛను పంపిణీ జరగాల్సివుంది. వారు కూడా వివిధ కారణాలతో అందుబాటులో లేకపోవడం వల్లే పింఛను బట్వాడా ఆగినట్లు అధికారులు చెబుతున్నారు.

పించన్ల పంపిణీలో స్థానిక ఎమ్మెల్యేలు

పంపిణీ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొని లబ్ధిదారులకు పింఛను అందజేశారు. జిల్లా కలెక్టరు నాగలక్ష్మి సహా, ఎమ్మెల్యేలు,



మంగళగిరిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అనురాధ

ఎమ్మెల్సీలు గురువారం ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు తమ చేతుల మీదుగా బట్వాడా చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆకుల వారితోట, సంతోష్‌నగర్, భారత్‌పేటల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. పెరిగిన పింఛను అందుకుంటున్న అవ్వాతాతల ముఖాల్లో వెలుగులు కనిపిస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నెహ్రూనగర్, బాలాజీనగర్, హస్సేన్ నగర్, ప్రియాంకా గార్డెన్స్, గుంటూరువారితోటలలో ఎమ్మెల్యే నసీర్ పింఛన్లు అందజేశారు. పేదల సంక్షేమానికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని నసీర్ ఈ సందర్భంగా తెలిపారు. మంగళగిరి పట్టణంలోని కొత్తపేట, ఆంజనేయ కాలనీ, సాయినగర్‌లలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ములుకుదురు, వేజెండ్లలో 1,446 మంది లబ్దిదారులకు పింఛన్లు అందజేశారు. గత ప్రభుత్వంలో పెత్తందారులకు పండగైతే, కూటమి ప్రభుత్వంలో పేదలు పండుగ చేసుకుంటున్నారని నరేంద్ర అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కొండ్రుపాడులో ఎమ్మెల్యే రామాంజనేయులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తొలి నెలలోనే పింఛన్లు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.



కొల్లిపరలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్



ములుకుదురులో పెన్షన్లు పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర





చినకోండ్రుపాడులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



గుంటూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, కలెక్టర్ నాగలక్ష్మి

బైక్ రేసులపై ఉక్కుపాదం

ఏకకాలంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

గుంటూరు, ఆగస్టు 1 : స్నేక్ డ్రైవింగ్ పేరుతో నగరవాసులను భయాందోళనకు గురిచేస్తున్న ఆకతాయిలపై పోలీసులు దృష్టి సారించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు, గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి నగరంలోని పలు ప్రధాన జంక్షన్‌లలో విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ సతీష్ కుమార్ స్వయంగా రంగంలోకి దిగి ఆయా తనిఖీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పట్టుబడిన విద్యార్థులకు తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్లుగా ఉన్న మీ పిల్లలకు ఎట్టి పరిస్థితిలో వాహనాలు ఇవ్వరాదని తెలియజేశారు. రానున్న రోజుల్లో ఈ తరహా తనిఖీలు మరింత ముమ్మరంగా నిర్వహిస్తామన్నారు. స్నేక్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, బైక్ రేస్‌లు, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు వంటి వాటిని సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా లైసెన్స్ లేకుండా వాహనాలు నడు పుతూ పట్టుబడితే ఆయా రికార్డులు పరిశీలించి హెచ్చరించి పంపుతున్నట్లు తెలిపారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్‌ల తల్లిదండ్రులకు శుక్రవారం పరేడ్ గ్రౌండ్‌లో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో....

లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిందూ కాలేజ్, మున్సిపల్ టిబి సెంటర్ నందు ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నచికేత్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 27 వాహనాలను సీజ్ చేశారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉమెన్స్ కాలేజ్ నాజ్ సెంటర్ వద్ద జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 35 వాహనాలను సీజ్ చేశారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకాని రోడ్డులోని సిమ్స్ కాలేజ్ వద్ద సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 53 మోటర్ సైకిళ్ళు ఒక ట్రాక్టర్, ఒక ట్రక్ ఆటో సీజ్ చేశారు.

వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో..

అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 4/1 నందు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 34 వాహనాలను సీజ్ చేశారు. నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటి అగ్రహారం ఎస్‌కేబీఎం హైస్కూల్ వద్ద ఎస్సీ, ఎస్టీ డీఎస్పీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 11 మోటార్ సైకిల్స్‌ను సీజ్ చేశారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం బేకర్స్ ఫన్ వద్ద డీసీఆర్‌బీ డీఎస్పీ, సీసీఎస్ డీఎస్పీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 34 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్‌పీ శ్రీనివాసరావు, ఎస్సీ ఎస్టీ డీఎస్పి మల్లికార్జునరావు, సీసీఎస్ డీఎస్పీ శివాజీ , వెస్ట్ డీఎస్పీ మహేష్, సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బ్రాడీపేట నాలుగో లైన్‌లో పట్టుబడిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



పెరవలిపాలెం గ్రామంలో వృద్ధునికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజల విశ్వాసాన్ని పొందుతున్నాం

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఆగస్టు1: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం వారి విశ్వాసాన్ని పొందుతోందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం ఆయన పెరవలిపాలెం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వికలాంగులు, వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ శ్రేణులు ఏర్పాటు చేసిన వేదిక వద్ద సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆనందబాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. 2019లో జగన్ రూ.3వేలు పెన్షన్ ఇస్తానని ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పెంచిన పింఛన్లను ప్రతి నెలా మొదటి రోజునే లబ్ధిదారులకు స్వయంగా అందజేస్తున్నాని తెలిపారు. జగన్ పాలనలో జరిగిన అరాచకాలు, దోపిడీలపై విచారణ జరిపి రాష్ట్ర స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని, అలాగే ప్రతి గ్రామస్థాయిలోనూ జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. పారదర్శకతతో పాలన కొనసాగించేందుకు ప్రజల ఆశయాలకు అనుగుణంగా సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అదే బాటలో నడుస్తున్నారని ఒకే మాట, ఒకే బాటగా ప్రతి విషయాన్ని చర్చించుకుని ముందుకు సాగుతున్నారని కొనియాడారు. జగన్ అనే భూతాన్ని తరిమికొట్టి ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి స్వాగతం పలికిన ప్రజలకు అంతా మేలు జరుగుతుందని భరోసానిచ్చారు. రాష్ట్రాన్ని పునఃనిర్మించాల్సిన అవసరం ఉందని, ఆ ప్రక్రియలో భాగంగా పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా 164 సీట్లను కూటమి ప్రభుత్వానికి అందించిన ప్రజలకు కృతజ్ఞతాభావంగా బాధ్యతగా ప్రతి ఒక్కరం వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, ఎస్సీ సెల్ నాయకులు దొప్పలపూడి సుధాకర్, మాజీ సర్పంచ్ సాంబశివరావు, కుచ్చెళ్ళపాడు, చావలి సర్పంచ్‌లు గాజుల వెంకట సుబ్బయ్య, విష్ణుమొలకల శ్రీనివాసరావు, బండారు సూరిబాబు, టీడీపీ లీగల్ సెల్ నాయకులు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహా.. ఒకటో తారీఖు

● కొత్త, కాంట్రాక్టు ఉద్యోగుల ఖాతాల్లో జమైన జీతాలు
● ఐదేళ్ల తర్వాత ప్రభుత్వ సిబ్బంది కళ్లలో ఆనందం

మొన్నటి వరకు అమ్మో.. ఒకటో తారీఖు అనుకున్న ప్రభుత్వ ఉద్యోగులు.. ఇప్పుడు ఆహా.. ఒకటో తారీఖు అంటున్నారు. ఐదేళ్ళ తర్వాత నెల మొదటి రోజు జీతం అందుకోవడం ఆనందాన్ని కలిగిస్తుందని అంటున్నారు. చంద్రబాబు నాయుడు పుణ్యమాని ఇప్పుడు ఇంటి అద్దె.. కరెంటు బిల్లు..పిల్లలు ఫీజులు.. నిత్యావసరాలకు దిగులుచెందే పనిలేదని చెబుతున్నారు.



గుంటూరుసిటీ, ఆగస్టు 1: ఉమ్మడి గుంటూరుజిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు గురువారం ఉదయం 9 గంటల నుంచే జీతాలు పడటం ప్రారంభం అయ్యాయి. మధ్యాహ్నం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా జీతాలు జమ అయ్యాయి.2014 నుండి 2019 వరకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఇదేవిధంగా నెల 1వ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు అందుకున్నారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఏ నాడు ఒకటో తారీఖు జీతాలు ఇచ్చిన దాఖలాలు లేవు. ఉపాధ్యాయుల పరిస్థితి అయితే మరీ దారుణం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారన్న భావనతో ఉపాధ్యాయులకు ప్రతి నెల 15వ తారీఖు తర్వాత జగన్ ప్రభుత్వం జీతాలువేయటం జరిగింది. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆ ప్రభుత్వంలో కన్నీళ్లురాలని రోజు లేదు. కాంట్రాక్టు ఉద్యోగులకు నెలాఖరుకు జీతాలు ఇవ్వగా, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తూ వచ్చారు. చిన్నాచితక ఉద్యోగులు సరిగ్గా జీతాలు రాకపోవడంతో అవసరాలు తీర్చుకొనేందుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలైన ఘటనలు అనేకం వెలుగు చూశాయి.

రోజులు మారిపోయాయి...

ఎట్టకేలకు ప్రభుత్వం లోని అన్ని స్థాయిలు, విభాగాలకు చెందిన కష్టాలు ఈడేరాయి. ప్రతినెల మొదటి రోజునే జీతాలు చెల్లిస్తామని చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు నెరవేరడం తో నెలవారీ బాధలకు కాలం చెల్లింది.ఆగస్టు నెల ఒకటో తేదీన చేతికి జీతాలు రావటం సంతోషంగా ఉందని రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చెబుతున్నారు. ఇంక నిచ్చింతగా ఉండొచ్చన్న భావన వారిలో వ్యక్తం అవుతోంది.

జిల్లాలో అందరికీ జీతాలు పడ్డాయి
టీ. రాజగోపాలరావు, జిల్లా ఖజానా అధికారి



గుంటూరు జిల్లాలో సుమారు 22 వేల మంది రెగ్యులర్, 11 వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వున్నారు. దరిదాపుగా అందరికీ జీతాలు జమయ్యాయి. పెన్షనర్లకు కూడా జమ అవుతున్నాయి. ఒకటో తేది ఉదయం నుంచే చెల్లింపులు ఆరంభం అయ్యాయి. సీఎఫ్‌ఎంఎస్ చక్కగా పనిచేస్తుంది. ఏవిధమైన సమస్యలు లేవు. ప్రభుత్వ ఖజానాలో ఫండ్స్ ఉన్నట్లు సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లుల ఆధారంగా అర్థం అవుతోంది. ఫండ్స్ వున్నప్పుడు క్లియరెన్స్ చకచక జరుగు తుంది. చాలామంది ఉద్యోగులు నన్ను వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు చెబుతున్నారు. కృతజ్ఞతలు చెప్పాలిసింది నాకు కాదు ప్రభుత్వానికి.

ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఉద్యోగులను మరవలేదు
- మలినేని భానుమూర్తి, తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



కూటమి ప్రభుత్వం వాస్తవానికి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటుంది. వాటేటితో పని లేకుండా సీఎం చంద్రబాబు ఉద్యోగుల విషయంలో చాలా ఉదారంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నో రోజుల తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు నెల మొదటి రోజే జీతాలు తీసుకుంటున్నారు. ఇది ఉద్యోగుల్లో ఎంతో ఆనందం కలిగిస్తుంది. ఇది ఉద్యోగుల అనుకూల ప్రభుత్వం అనటానికి ఇదే నిదర్శనం.

నీటి సరఫరా కొనసాగింపు

అన్నదాలకు తీపి కబురు
రెండు రోజుల్లో అధికారిక ప్రకటన
సాగర్‌కు జలకళ.. 3.69 లక్షల కూసెక్కుల వరద



కుడి కాలువకు నీటి సరఫరా

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ జలాశయం జలకళ సంతరించుకుంది. వరదనీరు పోటెత్తుంతోంది. రోజు రోజుకు నీటినిల్వలు గణనీయంగా పెరుగుతున్నాయి. కుడికాలువ అయకట్టులో సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి. భారీగా వరద వస్తున్న ఈ నేపథ్యంలో ప్రభుత్వం కుడి కాలువకు సాగు నీరు సరఫరా చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం కుడి కాలువకు తాగు నీటి అవసరాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. నీటిసరఫరాను కొనసాగించనున్నట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. సాగునీటి సరఫరాపై రెండురోజుల్లో ప్రభుత్వం అధికారికంగా ప్రకటించనుంది. ఇప్పటికే కేఆర్ఎంబీకి జలవనరులశాఖ సాగునీటి సర ఫరా అనుమతికి లేఖపంపింది. సాగునీటి సరఫరాను కొనసాగిస్తుండటంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది సాగు నీరు లేక అయకట్టులో పంటలు సాగు కాగ బీళ్లుగా మారడంతో అన్నదాతలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. సాగర్ జలాశయం వారంలో నిండనుండటంతో అయకట్టులో వరి సాగు పూర్తి స్థాయిలో కానున్నది. రైతులు వరి విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. వరి నారు మళ్లు పోసేందుకు పోలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ ఉప్పొంగుతోంది. శ్రీశైలం జలాశయంలోకి గురువారం 3,09,600 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం గేట్లు తెరచి సాగర్‌కు 4,43,502 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయంకు 3,69,866 కూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. గత మూడు రోజుల్లో 47.17 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా సాయంత్రంకు 537.40 అడుగులకు చేరింది. 312.50 టీఎంసీలకు గాను 182.95 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. ఇంకా 129.55 టీఎంసీల నీరు వస్తు సాగర్ నిండుతుంది. కుడి కాలువకు 4,152 కూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. అల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాలను నుంచి భారీగా వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు దాదాపు 5 లక్షల కూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయంకు రెండు రోజుల్లో రానుంది. ఇంకా 14 లక్షల కూస్కెల నీరు వస్తే సాగర్ జలాశయం నిండుతుంది. అయితే ఇంతకు మించి నీరువచ్చి చేరితే సాగర్ నుంచి దిగువకు నీరు విడుదల అవకాశం ఉంది.

కుడి కాలువ ఆయకట్టు వివరాలు ఇలా..

జిల్లా	ఆయకట్టు(ఎకరాల్లో)
పల్నాడు	5,71,695
గుంటూరు	95,851
బాపట్ల	1,88,459
ప్రకాశం	2,60,618
మొత్తం	11,16,623

నీటి నిల్వ పెరుగుదల తేదీల వారీగా

తేదీ	టీఎంసీలు
జూలై 27	129.98
28	134.06
29	135.78
30	152.58
31	169.31
ఆగస్టు 1	182.95

డీసీసీబీలో రూ. కోట్లు కొల్లగొట్టారు

● వైసీపీ హయాంలో అడ్డగోలుగా అక్రమాలు
● నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలతో రుణాలు
● అక్రమార్కులతో అధికారులూ కుమ్మక్కైనట్లు ఆరోపణలు..
● లేమల్లెపాడు వాసికి నోటీసులతో తాజా స్కాం

గుంటూరు, ఆగస్టు1: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో అక్రమ రుణాల వ్యవహారాలు ఒక్కొక్కటికి వెలుగులోకి వస్తోన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పెద్దల అండతో కొందరు అధికారులూ కుమ్మక్కై నిబంధనలకు పాతరేసి రుణాలిచ్చి కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోప ణలు వెల్లువెత్తుతోన్నాయి.

డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నకిలీ పాసు పుస్తకాలతో రూ.కోట్లను కొల్లగొట్టారు. అంతేగాక పల్నాడు జిల్లాలో కోల్డ్ స్టోరేజ్‌లలో ఉన్న సరుకు చూపించి రైతుల పేరుతో దాని యజమాని రూ. 5 కోట్లు నొక్కేశారు. ఇందులో వైసీపీ పెద్దల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డీసీసీబీ పరిధిలోని ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలు , ఆధార్ కార్డులు పెట్టి పెద్ద ఎత్తున రుణాలు పొందారు. సామాన్య కూలీల పేర్లతో సొసైటీల్లో భారీగా రుణాలు పొందారు. ఇందులో అధికారులు, అప్పట్లో వైసీపీ నేతలు కుమ్మక్కై ఈ వ్యవహారం నడిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాజాగా వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడుకు చెందిన సిద్ధార్థకు నల్లపాడులోని డీసీసీ బ్యాంకు నుంచి రూ.10 లక్షలు రుణం తీసుకున్నట్లు, వారం రోజుల్లోగా చెల్లించాలంటూ నోటీసులు అందటంతో అతను ఖంగుతిన్నాడు. వాస్తవానికి అతనికి బ్యాంకుతో ఎటువంటి సంబంధం లేదు. కానీ అతనికి నోటీసులు అందటంతో సిద్ధార్థ నల్లపాడు బ్యాంకు అధికారులను నిలదీయటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సిద్ధార్థ పేరుతో కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి ఉందని, దానిపై రుణం ఇచ్చినట్లు రికార్డులు సృష్టించినట్లు వ్యవహారం బయటపడింది. దాంతో సిద్ధార్థ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అసలు విషయం బయటకు పొక్కటంతో బ్యాంక్ అధికారులు హుటాహుటిన ఆ రుణం తీసుకున్న వారి వద్ద నుంచి నగదు బ్యాంకుకు జమ చేయించినట్లు సమాచారం. అయితే ఇలాంటివి అనేకం జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఒక్క బ్రాంచ్ నుంచే అనేక మందికి నోటీసులు వెళ్ళాయని, తాము రుణం తీసుకోలేదంటూ బ్యాంకుకు వస్తున్నట్లు సమాచారం.

డ్వాక్రా రుణాల్లోనూ అక్రమాలు ?

డీసీసీబీలో వ్యక్తిగతరుణాలే కాకుండా డ్వాక్రా రుణాల్లో కూడా పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర బ్యాంక్ లో జరిగిన మోసాలపై విచారణ జరపించాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళల రుణాలను కూడా జిడిసిసిబి నుండి ఇవ్వొచ్చని చెప్పడంతో అనేక డ్వాక్రా సంఘాలు తమ రుణాలను జిడిసిసిబి కి మార్చుకున్నాయి. వీటితో పాటు ప్రాధమిక సహకార సంఘాల్లో కూడా బినామీ పేర్లతో రుణాలు పొందినట్లు వాటిపై విచారణ జరిపించాలని అప్పటి టిడిపి నేతలు పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. బ్యాంక్ కొత్త ఛైర్మన్ వచ్చేలోపే గత ప్రభుత్వం హయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణకు మోకాలడ్డిన వైసీపీ కీలక నేత

నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలతో రుణాలు పొందిన వ్యవహారంపై సొసైటీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పోలీసుల విచారణ దశలో వైసీపీ కీలక నేత రంగంలోకి దిగారు. మొత్తం వ్యవహారం బయటపడితే అసలు సూత్రధారులు, పాత్రదారులు బయటపడే అవకాశం ఉండటంతో సదరు కీలక నేత అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 1: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 537.40 అడుగులు ఉంది. ఇది 182.95 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 4152 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 22,592 క్యూసెక్కులు, మొత్తం అవుట్ ఫ్లో వాటర్‌గా 27,644 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,69,866 క్యూసెక్కులువచ్చి చేరుతోంది.

పథకాలకు త్యాగమూర్తుల పేర్లు

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పొందుగుల (దాచేపల్లి), ఆగస్టు 1: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు త్యాగమూర్తులు పేర్లు పెట్టుకున్నామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలియజేశారు. గురువారం దాచేపల్లి మండలం పొందుగుల గ్రామంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ పిడుగురాళ్ల సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆసుపత్రిగా, అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారికి పల్నాడు ప్రాంత వాసి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు పేర్లు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. గత నాలుగేళ్లుగా వైసీపీ పాలనలో అక్రమ కేసులు, ఆస్తులు విధ్వంసం, హత్యారాజకీయాలు మాత్రమే సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా సంక్షేమం, అభివృద్ధి అజెండాతో ముందుకు సాగుతోందన్నారు. ఈ క్రమంలో గురజాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజన్ కలిగిన నేత అని, ఆయన పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గురజాల నియోజకవర్గ పరిశీలకుడు కళ్లం రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ టీడీపీ పాలనలో రాష్ట్రం తిరిగి అభివృద్ధిని పుంజుకుంటుందని స్పష్టం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101, 109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

● జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర దంపతులు



గుంటూరుసిటీ, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ గురువారం తెలిపారు. ఎస్సీలలోని అన్ని కులాలకు ఈ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. 30ఏళ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా వర్గీకరణను సాధించుకోవడం అభినందనీయమని అన్నారు. వర్గీకరణకు సాధనకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ,అదే విధంగా వర్గీకరణకు మొదటినుంచి మద్దతు తెలిపిన సీఎం చంద్రబాబు నాయుడుకు ఆయా వర్గాలు రుణపడి ఉన్నాయన్నారు. పోరాటాన్ని తన భుజస్కంధాలపై వేసుకుని అలుపెరగని పోరాటం చేసి విజయం సాధించిన మందకృష్ణ మాదిగకు అభినందనలు తెలియజేశారు.

వర్గీకరణకు మద్దతు పలికింది చంద్రబాబే

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రత్తిపాడు, ఆగస్టు 1: దేశంలో మొట్ట మొదటి సారి ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపింది చంద్రబాబు నాయుడే అని, వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వర్గీకరణ వ్యవహారం ఆయా రాష్ట్రాలకే ఇవ్వడం సుభ పరిణామమన్నారు. సుప్రీం కోర్టు తీర్పుకి కట్టుబడి, ఏ వర్గానికి అన్యాయం జరగకుండా, అందరికి సమన్యాయం చేస్తామన్నారు. దళితుల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించడానికి జీవో 25ను చంద్రబాబు తీసుకువచ్చారని ఎమ్మెల్య తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు సానుకూలం

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



తాడికొండ, ఆగస్టు1: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సీఎం నారా చంద్రబాబునాయుడు ఎప్పుడూ సానుకూలంగానే వ్యవహించారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల చిరకాల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. సామాజిక న్యాయం పాటించే పేటెంట్ హక్కు టీడీపీదేనని మరోసారి స్పష్టమైందన్నారు. కులాల మధ్య జగన్ చిచ్చు పెట్టి చలికాచుకు న్నారన్నారు. మాదిగలకు కేవలం తన ఓటు బ్యాంకుగానే జగన్ చూశార తప్ప ఏనాడు వర్గీకరణపై మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం ఎస్సీల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు.

ఎన్ఐ వర్కులు కారణంగా 14 రైళ్ల రద్దు

● ఎనిమిది రైళ్ల దారి మళ్లింపు ● డీఆర్ఎం రామకృష్ణ వెల్లడి

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గుంటూరు మీదగా ప్రయాణించే 11 రైళ్లని దాదాపుగా వారం పాటు రద్దు చేస్తున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు నెంబరు. 07781 విజయవాడ - మాచర్ల, ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు నెంబరు. 07782 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశామన్నారు. ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు నెంబరు 07464 విజయవాడ - గుంటూరు, నెంబరు. 07465 గుంటూరు - విజయవాడ రైళ్లు రద్దు చేసినట్లు తెలిపారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు నెంబరు 07281 నరసపూర్ - గుంటూరు, ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు నెంబరు. 07281 నరసపూర్ - గుంటూరు, నెంబరు. 07785 రేపల్లె - గుంటూరు, నెంబరు. 07976 గుంటూరు - విజయవాడ, ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు నెంబరు. 17201 గుంటూరు - సికింద్రాబాద్, ఎంబరు. 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు నెంబరు. 17329 హుబ్లీ - విజయవాడ, ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు నెంబరు. 17330 విజయవాడ - హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశామన్నారు. ఈ నెల 5, 7, 8, 9, 10 తేదీల్లో నెంబరు. 12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ జనశతాబ్ధి, నెంబరు. 12078 విజయవాడ - చెన్నై సెంట్రల్ జనశతాబ్ధి ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశామని తెలిపారు.

కాగా నెంబరు. 12760 హైదరాబాద్ - తాంబరం ఎక్స్‌ప్రెస్, నెంబరు. 12759 తాంబరం - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు నల్గొండ, గుంటూరు మీదగా దారి మళ్లించడం జరుగుతుందన్నారు. నెంబరు. 12764 సికింద్రాబాద్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 2, 4, 5, 6, 8, 9 తేదీల్లో నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు మీదగా దారి మళ్లిస్తామన్నారు. నెంబరు. 12710 సికింద్రాబాద్ - గూడూరు ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు మీదగా దారి మళ్లిస్తాం. నెంబరు. 17406 అదిలాబాద్ - తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగాదారి మళ్లించి నడుపుతామన్నారు. నెంబరు. 12763 తిరుపతి - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 3, 5, 6, 7, 9, 10 తేదీల్లో గుంటూరు, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ మీదగా దారి మళ్లిస్తామన్నారు. నెంబరు. 12709 గూడూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ మీదగా నడుపుతామన్నారు. నెంబరు. 17405 తిరుపతి - అదిలాబాద్ కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదగా దారి మళ్లిస్తామన్నారు.

అరాచక శక్తులను అణచివేస్తాం

● కూటమి నేతలు సంయమనంతో వ్యవహరించాలి
● మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్ / రెంటచంతల, ఆగస్టు 1: వైసీపీ అరాచక శక్తులు రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగించాలని కుట్రలు పనుతున్నాతున్నారని, ఉక్కుపాదంతో వారిని అణిచివేస్తామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 36 హత్యలు జరిగాయని వైసీపీ నేతలు ఢిల్లీకెళ్లి రాద్ధాంతం చేయటం సిగ్గుచేటన్నారు. వైసీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు జరిగినప్పుడు, ఆస్తులు లాక్కొని పోలీసులు దౌర్జన్యం చేసినప్పుడు, హత్యలు, అత్యాచారాలు జరిగినప్పుడు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు నోరు విప్పలేదని ప్రశ్నించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆద్యుడని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కొనియాడారు.

రెంటచింతల, పాలువాయిగేట్ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి స్థానిక నేత నంబూరి శేషగిరిరావుని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి కర్రు కాల్చి వాతలు పెట్టినా ఇంకా బుద్ధిరాలేదన్నారు. వ్యక్తిగత కలహాల జరిగిన హత్యలను టీడీపీపై మోపిన వైసీపీ నేతలు రాజకీయంగా మరింత దిగజారిపోయారన్నారు. వైసీపీ హయాంలో విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలు, హింస, దౌర్జన్యాలు రాజ్యమేలాయని, వాటన్నింటిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

40,795 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 41,894 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 40,795 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 20,905 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	17000	334	9000	16500
నెంబరు. 5	9500	14000	నెంబరు. 5	9700	15000
273	9000	12000	273	11500	14000
341	9000	17000	341	10000	14300
4884	12500	12500	4884	11500	16000
సూపర్ 10	13500	13500	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18700	తేజ	8500	18500
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	9000	13500
దేవనూరు డీలక్స్	11500	12000	దేవనూరు డీలక్స్	10500	15000
తెల్లకాయలు	4000	12000	తెల్లకాయలు	5000	11500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఒక్కరోజులో రికార్డు స్థాయిలో పింఛన్ల పంపిణీ

● డేగల ప్రభాకర్



గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒక్కరోజులో రికార్డు స్థాయిలో పింఛన్ల పంపిణీ చేశామని, గురువారం ఉదయం 11 గంటలకల్లా 95 శాతం మందికి పింఛన్లు అందజేసి రికార్డు సృష్టించామని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వ్యవస్థలను సక్రమంగా వినియోగించు కుంటే పనులు ఎలా చేయవచ్చో కూటమి ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. నాడు వలంటీర్లు లేకుంటే పింఛన్లు పంపిణీ చేయలేక జగన్ చేతులెత్తేస్తే, ఇప్పుడు తమ ప్రభుత్వం ఉదయం 10గంటలకే 95శాతం పింఛన్ల పంపిణీ చేశామన్నారు. జగన్మోహన్‌రెడ్డి వ్యవస్థలను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత మాత్రమూ అనుకూలంగా లేకపోయినప్పటికీ, చిత్తశుద్ధితో సంక్షేమాన్ని అమలుపరుస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పారదర్శకమైన ప్రభుత్వాన్ని చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందన్నారు.

రాష్ట్రం కష్టాల్లో ఉన్నా 2,700 కోట్లు పింఛన్ల పంపిణీ

● కోవెలమూడి రవీంద్ర



గుంటూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో కష్టాల్లో ఉన్నా ప్రతి నెలా 65లక్షల మంది పింఛను దారులకు ఒకటో తేదీనే ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లు అందజేస్తున్నారని కోవెలమూడి రవీంద్ర(నాని) తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలకు నాలుగువేలు పింఛను ఇవ్వడాన్ని వైసీపీ వారు ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఐదేళ్లలో వైసీపీ వెయ్యి రూపాయలు పెంచితే చంద్రబాబు ఒక్కనెలలో పెంచారన్నారు. రాష్ట్ర పరిస్థితుల నేపథ్యంలో ఇది సాహసోపేతమైన చర్య అని ఆయన కొనియాడారు. దీన్ని చూసి జగన్ సిగ్గుపడాలన్నారు. ఆరు నెలలు కూడా నిండని ప్రభుత్వంపై జగన్ కుట్రలు పన్నడం దారుణమన్నారు. రాష్ట్రంలో సంపద సృష్టించడం, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడం, పాలనను గాడిలో పెట్టడం, పెట్టుబడులు తీసుకురావడం వంటి కార్యక్రమాలు ఉన్నాయని, అన్నింటినీ చంద్రబాబు తన అనుభవంతో పూర్తి చేస్తారని చెప్పారు. చంద్రబాబు వయసును, ఆయన పడేకష్టాన్ని చూసి వైసీపీ నేతలు సిగ్గు తెచ్చుకోవాలని ఆయన హితవు పలికారు.

వైద్య, బీమా ప్రీమియంలపై జీఎస్‌టీ ఎత్తివేయాలి

గుంటూరు, ఆగస్టు 1: ప్రజలు తీసుకునే వైద్య, బీమా ప్రీమియంలపై జీఎస్‌టీని ఉప సంహరించుకోవాలని ఆరోగ్య ప్రచారకులు టి.బిక్షపతి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాల యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవిత బీమా, వైద్య బీమాలు ప్రస్తుతం సామాజిక అవసరంగా మారిపోయిందన్నారు. అటువంటి ప్రీమియంలపై 18 శాతం జీఎస్‌టీ విధించటం ప్రజలకు మోయలేని బారమే అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం బీమా ప్రీమియంలపై జీఎస్‌టీ ని ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ప్రసాద్ తదితరులున్నారు.

జీఎస్‌టీ కస్టమ్స్ అప్పీల్స్ అడిషనల్ కమిషనర్‌గా సౌమ్య

గుంటూరు, ఆగస్టు 1: ఉమ్మడి జిల్లా కేంద్రం గుంటూరులోనీ జీఎస్‌టీ, కస్టమ్స్ అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయ అడిషనల్ కమిషనర్‌గా నూతల పాటి సౌమ్య నియమితులయ్యారు. ఆమె విజయవాడలోని కస్టమ్స్ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తూ గుంటూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్ మధుసూదనరెడ్డిని గుంటూరు కన్నావారితోటనున్న సెంట్రల్ జీఎస్‌టీ కమి షనరేట్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా నియమించారు. కాగా జీఎస్ టీ, కస్టమ్స్ కేసులకు సంబంధించిన అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయం రాష్ట్రంలో ఒక్క గుంటూరులోనే ఉంది.

బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి విజేతగా హైదరాబాద్



విజేతలతో హైదరాబాదు సెంట్రల్ ఎక్సైజ్ కస్టమ్స్ కమిషనర్ జి.సురేష్‌బాబు తదితరులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 1: గుంటూరు రూరల్, నల్లపాడు, లొయోలా పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రీజి యన్ ఐసీఎస్ఈ పాఠశాలల అండర్ -14, 17, 19 బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. అండర్-14, 19 విభాగాల్లో ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (హైదరాబాదు), అండర్ 17లో ది హైదరాబాదు పబ్లిక్ స్కూల్ (బేగంపేట, హైదరాబాదు) విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమంలో సెంట్రల్ హైదరాబాదు సెంట్రల్ ఎక్సైజ్ కస్టమ్ కమిషనర్, బాస్కెట్‌బాల్ టెక్నికల్ కమిటీ ఛైర్మన్ ఆంధ్రా రీజియన్ జి.సురేషుబాబు, సీనియర్ న్యాయ వాది, జువైనల్ జ్యూడిషియల్ బోర్డు మాజీ సభ్యులు, ఆంధ్రా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.రేవతి హాజరై విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒలింపిక్స్ పతకాలు సాధించిన వారి స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కర స్పాండెంట్ పి.ఆంటోని, పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సురేష, నరేష్, కోచ్‌లు, పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు

గుంటూరు(విద్య), ఆగస్టు 1: స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో విజయకేతనం ఎగరవేశారని పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 11 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు అమర్‌నాథ్ చెరుకూరి వెండి పతకం, జి.లోకేశ్ రజిత పత కం సాధించారని తెలిపారు. స్టైమ్ స్కూల్లో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో సీహెచ్ పవన్‌కళ్యాణ్ బంగారు పతకం సాధించాడని తెలిపారు. ఇదే విభాగంలో సీహెచ్ పూజిత వెండిపతకం, ఎస్ రేవంత్, ఎస్ వసంత్ రజిత పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను ఈ సం దర్భంగా పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏవో వెంకటరావు తదితరులు అభినందించారు.

వీఆర్‌ఏ సమస్యలపై సామూహిక వినతులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 1: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న ఎమ్మార్వోలకు, 7న ఆర్డీవోలకు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వీ ఆర్‌ఏల సంఘ జిల్లా అధ్యక్షుడు వడ్డే బాజీబాబు అన్నారు. గురువారం స్థానిక పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు బి లక్ష్మణరావు, షేక్ నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ముఖాల్లో వెలుగులు : గల్లా మాధవి



పింఛన్ నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న రూ.4వేల పింఛన్‌ను అందుకుంటున్న అవ్వాతాతల ముఖాల్లో వెలుగులు కనిపిస్తున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. నియోజకవర్గంలోని ఆకులవారి తోట, సంతోష్ నగర్, భారత్‌పేటలలో ఎమ్మెల్యే గల్లా మాధవి గురువారం నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటికొచ్చిన పింఛను డబ్బులతో అవ్వాతాతల ముఖాలు వెలిగిపోతున్నాయని అన్నారు. పెరిగిన పింఛను నేరుగా ఇంటికే రావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ హామీని పక్కాగా అమలు చేశారని, గత ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచటానికి నాలుగున్నర సంవత్సరాలు తీసుకుంటే, చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఒక్క సంతకంతోనే మూడు వేల రూపాయల ఫించన్‌ను నాలుగు వేలు చేసి నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించటం పేదలపై ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని గల్లా మాధవి అన్నారు.

ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చింది జగన్‌రెడ్డి కాదా?

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చింది జగన్మోహన్‌రెడ్డి కాదా అంటూ గల్లా మాధవి ప్రశ్నించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆమె గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ మీద మాజీ మంత్రి విడదల రజిని అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. గడిచిన ఐదేళ్లలో ఆస్పత్రులు, యాజమాన్యాలు తమ పెండింగ్ బకాయిలు చెల్లిస్తేనే ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేస్తామని లేనిపక్షంలో నిలిపి వేస్తామని హెచ్చరించి, ఒకానొక దశలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసిన విషయం రజిని మరిచిపోయి, సీఎం చంద్రబాబు మీద అసత్య నిరాధార ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందన్నారు. గత ప్రభుత్వ విధానాలపై అసెంబ్లీలో చర్చకు పెట్టి శ్వేత పత్రాలు విడుదల చేస్తే ప్రతిపక్షం భయపడి అసెంబ్లీకి రాకుండా పారిపోయిందని ఎద్దేవా చేశారు. విడుదల రజిని విలేకరుల సమావేశం తన ఉనికిని నిలబెట్టుకోవడానికేనన్నారు.

గల్లా మాధవి తొలి నెల జీతం వితరణ

ఎమ్మెల్యే మాధవి తన మొదటి నెల జీతంలో నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి, అన్న క్యాంటీన్లకు విరాళం, నియోజకవర్గంలోని పేదలకు దుప్పట్లు ఇచ్చేందుకు, సచివాలయపరిధిలో మొక్కలను నాటేందుకు, పార్టీలోని పేద కార్యకర్తలకు, డివిజన్లోని ప్రజలకు సహాయం చేసే నిమిత్తం అందించనున్నారు.

● పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ల మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు. ఈ నెల పదో తేదీ లోపు పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయబోతున్నామని తెలిపారు.

5 నాటికి అన్న క్యాంటీన్లు సిద్ధం చేయాలి

● ఇన్‌చార్జి కమిషనర్ ఎస్ హరికృష్ణ



అన్న క్యాంటీన్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ హరికృష్ణ

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి పేదవానికి అల్పాహారం, భోజనంను నామమాత్రపు ధరకే అందించేందుకే సంకల్పించి పునఃప్రారంభం చేయనున్న అన్న క్యాంటీన్లను గుంటూరు నగరంలో ఈ నెల 5 నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని నగర కమిషనర్ (ఎఫ్ఏసీ) ఎస్ హరికృష్ణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో జరుగుతున్న మరమ్మతు పనులను కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, పనుల వివరాలు, టెండర్‌పై ఎస్ఈని అడిగీ తెలుసుకొని, పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ హరికృష్ణ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చుట్టుగుంట, మిర్చియార్డు, నల్లచెరువు, పల్నాడు బస్టాండ్, ఆర్డీవో ఆఫీస్, ఐడీ హాస్పిటల్, బస్టాండ్ ప్రాంతాల్లోని 7 అన్న క్యాంటీన్లను ఈ నెల 5వ తేదీ నాటికి వినియోగంలోకి తీసుకురావడానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రధానంగా పెయింటింగ్, విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు, లైట్లు, గ్లాస్ డోర్స్, ఫ్లోర్ మరమ్మతులను చేపట్టాలన్నారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిబంధ నలకు అనుగుణంగా, నాణ్యతా ప్రమాణాల్లో రాజీ లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతిపై డీఈఈలు, ఈఈలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ ఎం.శ్యాం సుందర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటే శ్వరరావు, శ్రీనివాస్, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు, ఏఈలు, సచివాలయ ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ పటిష్ఠంగా చేపట్టాలి

ఘన వ్యర్థాల నిర్వహణ పటిష్ఠంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టినప్పుడే రోజువారి వ్యర్థాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని నగర కమిషనర్ (ఎఫ్ఏసీ) ఎస్ హరికృష్ణ తెలిపారు. గురువారం నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత జిందాల్ ప్రతినిదులతో ప్లాంట్ సామర్థ్యం, అవసరమైన వ్యర్థాలు, ఏ మున్సిపాలీటీల నుంచి ఎంత చెత్త వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది తదితర వివరాలు అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్యగా ఉందని, ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను ఒక చోట డంప్ చేయడం ద్వారా స్థలాభావ సమస్య కూడా ఎదురవుతుందన్నారు.

వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ద్వారా వ్యర్థాల నిర్వహణ తేలిక అవుతుందన్నారు. ప్రజారోగ్య సిబ్బంది గుంటూరు లక్ష్యానికి అనుగుణంగా ప్రతి రోజు 320 టన్నుల వ్యర్థాలను జిందాల్ ప్లాంట్‌కు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ కొండారెడ్డి, డీఈఈ సతీష్, ఏఈ రవికిరణ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్‌కుమార్, జిందాల్ ప్లాంట్ డీజీఎం ఎస్‌సీ రాయుడు, సీనియర్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, మేనేజర్ ఎస్ భార్గవ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

● స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ



మాట్లాడుతున్న ఏసుబాబుమాదిగ, పాల్గొన్న సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 1: అత్యంత క్లిష్టమైన ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెల్లడించిందని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గోరంట్లలోని సంఘ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుదీర్ఘ 30 ఏళ్ల ఉద్యమంలో అనేక మంది తమ ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటాలు ఎనలేనివని అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సహకరించిన ప్రధాని మోదీ, కిషన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు మక్కెన ప్రభాకర్, సుబ్బయ్య మాదిగ, రమణ ప్రసాదు, అబ్రహమ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల పోరాట విజయం చారిత్రాత్మకం : శ్రీధర్

గుంటూరు, ఆగస్టు 1 : మాదిగల పోరాట విజయం చరిత్రాత్మకమైందని, ఈ నేపథ్యంలో మాదిగలు, ఉద్యమ నేతలకు బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం బ్రాడీపేటలోని బ్రాహ్మణ చైతన్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సమస్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బ్రాహ్మణ చైతన్య వేదిక స్వాగతిస్తోందన్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మాదిగలు 30 ఏళ్ల నుంచి అలుపెరగని ప్రజా పోరాటాలు చేయడమే గాక దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టారన్నారు. దేశవ్యాప్తంగా మందకృష్ణ చేస్తున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి దేశంలోనే తొలిసారిగా నైతిక మద్దతు ఇచ్చి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసి వర్గీకరణ ఫలాలను చంద్రబాబునాయుడు అప్పట్లోనే అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డమాను ప్రసాదు, ఎండపల్లి శబరి, వంగవీటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ మాలమహానాడు నిరసన

● కేంద్రం కనుసన్నల్లోనే తీర్పు అంటూ ఆరోపణలు
● తీర్పుపై రివ్యూ పిటీషన్ దాఖలు చేస్తాం



అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న మాలమహానాడు నాయకులు

గుంటూరు, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నగరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే తీర్పు వచ్చిందంటూ ఆరోపిస్తూ నినాదాలతో ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కొట్టివేసిన ఇదే అత్యున్నత న్యాయస్థానం నేడు ఏడుగురు న్యాయ మూర్తుల ధర్మాసనం ఏ విధంగా వర్గీకరణ సమంజసమంటూ తీర్పు ఇచ్చిందో చెప్పాలన్నారు. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే తీర్పు వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు, అంబేద్కర్ వాదులు గమనించాలని సంవత్సరాల తరబడి మెజారిటీ జనాభా కలిగిన దళితులు 15 శాతం రిజర్వేషన్‌కే పరిమితమై విద్య, ఉద్యోగాల్లో ఇబ్బందులకు గురవుతుంటే రిజర్వేషన్ పెంచే ఆలోచన చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేకపోవటం దురదృష్టకరమన్నారు. ఈ తీర్పుపై తిరిగి మళ్ళీ సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అలానే రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలు పార్లమెంట్‌లో వర్గీకరణకు మద్దతు తెలిపితే ఎంపీల ఇళ్ల ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాలలంతా ఏకతాటి పైకి వచ్చి భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేసే ఇలాంటి తీర్పులను వ్యతిరేకించాలన్నారు. ఈ తీర్పుపై మేధావులు పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మాలమహానాడు సంఘం నాయకులు ఉన్నారు.

పట్టాభిపురం సీఐగా కిరణ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కిరణ్

గుంటూరు, ఆగస్టు 1 : పట్టాభిపురం సీఐగా నియమితులైన పి.కిరణ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బుధవారం రేంజ్ పరిధిలో భారీగా సీఐలను బదిలీ చేస్తూ ఐజి త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. దీనిలో భాగంగా పట్టాభిపురం సీఐగా కిరణ్‌ను నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన విజయ చంద్రను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో కఠిన వైఖరి అవలంబించనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు మెరుగైన సేవలు అందేలా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టేషన్ పరిధిలో విద్యాసంస్థల వద్ద ఆకతాయిలపై ప్రత్యేక దృష్టిపెడతామని స్నేక్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, బైక్ రేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తూ తగు చర్యలు తీసుకుంటామని సీఐ కిరణ్ తెలిపారు.

జిల్లాలో కొనసాగుతున్న సెల్‌ఫోన్‌ల గుర్తింపు ప్రక్రియ

● 300 సెల్‌ఫోన్‌ల రికవరీ.. బాధితులకు అప్పగింత

గుంటూరు, ఆగస్టు 1: జిల్లాలో ప్రజలు వివిధ రకాలుగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. దీనిలో భాగంగా గురువారం సుమారు రూ.45 లక్షల ఖరీదైన 300 సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయా బాధితులకు పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.3 కోట్ల 11లక్షల 40వేల ఖరీదైన 2076 వివిధ బ్రాండెడ్ కంపెనీల మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ప్రజలకు అందజేశామన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ అనే పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారం దుర్వినియోగం కాకుండా సెల్‌ఫోన్ బ్లాక్ అవుతుందన్నారు. అలాగే పోగొట్టుకున్న ఫోన్‌ను త్వరగా రికవరీ చేస్తామన్నారు. అలాగే ప్రజలు తమ విలువైన వస్తువులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ తీసుకున్నవారు ఎస్పీకి, నోడల్ అధికారిగా ఉన్న అడ్మిన్ అడిషనల్ ఎస్పీ రమణమూర్తికి, సోషల్ మీడియా సైబర్ సెల్ ఇన్‌చార్జ్ మౌలా షరీఫ్‌కి, ఐటీ కోర్ టీం సభ్యులకు, రికవరీ టీం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ ప్రారంభం

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 1: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జిల్లాలో గురువారం ఉదయం 6గంటల నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయడం ప్రారంభించినట్లు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గురువారం ఉదయం గుంటూరు పట్టణంలోని దేవాపురం కాలనీలోని 120వ సచివాలయం పరిధిలో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కలెక్టర్ ఐదు మంది లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే నగదును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులందరికీ పింఛను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్లు వెంకటలక్ష్మి, శ్రీనివాసులు, పశ్చిమ గుంటూరు తహసీల్దార్ ఫణీంద్ర, వీఆర్‌వో నసీమా, అడ్మిన్ సెక్రటరీ పావని, వార్డు సెక్రటరీలు ప్రవీణ్, జ్యోతి పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతను అందరికీ వివరించాలి

గుంటూరు సిటీ, ఆగస్టు 1: తల్లిపాల ఆవశ్యకతను వైద్య, ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ సిబ్బంది అందరికీ వివరించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆగస్టు ఒకటి నుంచి ఏడో తారీఖు వరకు జరుగనున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ, ఈ మెటీరియల్ ఆరోగ్య కార్యకర్తలకు అందజేయాలని, అందులోని అంశాల ఆధారంగా వారం రోజులపాటు తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి తెలియజేయవలసిన బాధ్యత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని అన్నారు. కార్య క్రమంలో డీఎం హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ అన్నపూర్ణ, జయప్రసాద్, ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● గుంటూరు (మెడికల్) ఆగస్టు 1: బిడ్డను ప్రసవించిన మొదటి గంటలో తల్లి శిశువుకు తప్పనిసరిగా పాలు పట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి సూచించారు. తల్లిపాల ప్రోత్సాహక వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బృందా వన్ గార్డెన్స్ పట్టణ ఆరోగ్య కేంద్రంపరిధిలో, పండరీపురం అంగన్‌వాడీ సెంటర్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె ప్రసంగించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, బృందావన్‌గార్డెన్స్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి వైష్ణవి, జయప్రసాద్, శాస్త్రీ, టీ.కృష్ణవేణి, వాణి, చంద్రకళ, సుచరిత, మంగాయమ్మ, మాదశి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నార్త్ క్లబ్ నిర్వహణ వ్యవహారం వివాదాస్పదం

● తమకు మరో రెండు నెలలు లీజు గడువు ఉందన్న ఓ వర్గం
● పాలక వర్గానికి అనుకూలంగా మాలమహానాడు వర్గీయులు

గుంటూరు, ఆగస్టు 1 : నార్త్ క్లబ్ నిర్వహణ వ్యవహారం వివాదాస్పదమైంది. పట్టాభిపురం మెయిన్ రోడ్డుపై ఉన్న నార్త్ క్లబ్‌లో కొద్దిరోజులుగా ముమ్మరంగా పేకాట నడుస్తోంది. క్లబ్బు పాలకవర్గ సభ్యులు మూడు నెలల క్రితం తనకు ఐదు నెలల పాటు నిర్వహించుకునేలా లీజుకు ఇచ్చారని కోనూరి కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. తనకు ఇంకా రెండు నెలలు గడువు ఉన్నప్పటికీ తనకు చెప్పకుండా క్లబ్‌లో పేకాట ఆడిస్తూ క్లబ్‌ను మీరు ఎలా నిర్వహిస్తారని కిరణ్ ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నెగంటి రమేష్ మరికొందరితో కలిసి నార్త్ క్లబ్‌కి వచ్చారు. క్లబ్‌లో పేకాట నిలిపివేసి తనకు అప్పగించాలని ఆయన పాలకవర్గం ప్రతినిధి రామమూర్తిని డిమాండ్ చేశారు. అందుకు ఆయన నోసేమీరా అన్నారు. ఇంతలో క్లబ్ పాలకవర్గానికి అనుకూలంగా మాల మహానాడు నాయకురాలు చింతల దేవి మరికొందరు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వచ్చి ఇరువర్గాలను సముదాయించి పంపారు.

పింఛన్లు పంపిణీ చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

గుంటూరు సిటీ, ఆగస్టు 1 : పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్ 58వ సచివాలయం పరిధిలోని ఆర్ అగ్రహారం రావుబహద్దూర్ బిల్డింగ్ దగ్గర నుంచి శివాలయం వీధి నరసింహస్వామి కోవెల ఏరియాలో ఉన్న వృద్ధులకు ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో 18వ డివిజన్ అధ్యక్షుడు ఉడతా నరసింహారావు, కూనిశెట్టి చంద్రశేఖర్, పద్మనాభం జనసేన నాయకులు రాజా, రమణ, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతినిధులను సత్కరిస్తున్న కళాశాల అకడమిక్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర

విజయవంతంగా ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు

గుంటూరు(విద్య), ఆగస్టు 1: ప్రపంచంలోని అగ్రదేశాల సాంకేతిక నిపు ణులు, శాస్త్రవేత్తల సహకారంలో ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు ఆర్వీఆర్ అండ్‌జేసీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాదులో విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయ పాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తదితరులు గురువారం ఒక ప్రటనలో హర్షం వ్యక్తం చేశారు. వివిధ దేశాల నుంచి 92 మంది ప్రతినిధులు హాజరయ్యారని అన్నారు. స్మార్ట్‌గ్రిడ్, ఇండస్ట్రీ 4.0, ఆర్టిఫియల్ ఇంటిలిజెన్స్ తదితర అంశాలపై సదస్సు నిర్వహించినట్లు తెలిపారు.

రేషన్ సరుకుల పంపిణీని తనిఖీ చేసిన జేసీ



ఏటీ అగ్రహారం జీరో లైనులో ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న జేసీ

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో రేషన్ సరుకుల పంపిణీని జాయింట్ కలెక్టర్ భార్గవతేజ తనిఖీ చేశారు. గురువారం ఆయన ఏటీ అగ్ర హారం జీరో లైనులోని ఎండీయూ వాహనం నెంబరు. జీఎన్ 26017 వద్దకు వెళ్లి ఆపరేటర్ వద్ద ఉన్న స్టాక్‌ని పరిశీలించారు. ఆపరేటర్ ప్రతీ నెల సరు కులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకొన్నారు. కార్డుదారులతో ఫోర్టిఫైడ్ రైస్ నాణ్యత ఎలా ఉంటుంది అనే విషయాన్ని చర్చించడంతో పాటు ఎండీయూ వాహనం నిర్దీత సమయానికి వస్తుందా, లేదా అని ప్రశ్నించారు. ధరల నియంత్రణలో భాగంగా పౌరసరఫరాల శాఖ వినియోగదారుల సౌకర్యార్థం రైతుబజార్లు, హోల్‌సేల్ బియ్యం, పప్పు దుకా ణాలు, బిగ్‌ఛైన్ రిటైల్ మార్కెట్స్‌లో బియ్యం కందిపప్పు ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కేజీ కందిపప్పు రూ.150, బీపీటీ/ సోనా మసూరి స్టీమ్ బియ్యం కేజీ రూ.48, ముడిబియ్యం రూ.47కి విక్రయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫణీంద్రబాబు, సీఎస్‌డీటీ శివశంకర్ పాల్గొన్నారు.

సీఐల పోస్టింగ్స్‌లో మరో వివాదం

● నాడు ఐదేళ్లు అధికార పార్టీతో అంటకాగిన సీఐకు పోస్టింగా?
● సీఐ వ్యవహారంపై టీడీపీ శ్రేణుల ఆందోళన

గుంటూరు, ఆగస్టు 1 : మరో సీఐ వ్యవహారం వివాదాస్పదం అవుతోంది. ప్రస్తుతం నెల్లూరులో విధులు నిర్వహిస్తున్న సీఐ అల్తాఫ్ హుస్సేన్ వ్యవహారం టీడీపీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తుంది. ఆయనను లాలాపేట సీఐగా నియమించేందుకు స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పోలీస్ ఉన్నతాధికారులకు సిఫార్సు లేఖ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అల్తాఫ్ హుస్సేన్‌పై అప్పటి అధికార పార్టీ వైసీపీ ముద్ర ఉంది. ఇదిలాఉంటే గురువారం నెల్లూరులో జరిగిన సమీక్ష సమావేశానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ కార్పొరేటర్‌లతో కలిసి సమావేశ హాలులోకి వెళ్తుండగా సీఐ అల్తాఫ్ హుస్సేన్ వారిని అడ్డుకునే ప్రయత్నం చేయడం వివాదాస్పదమైంది. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు శ్రీధర్‌రెడ్డి కూడా ఆయన వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి వచ్చిన మంత్రి నారాయణకు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ గొడవకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ పరిస్థితుల్లో అల్తాఫ్ హుస్సేన్‌ను లాలాపేట సీఐగా నియమించబోతున్నారంటూ టీడీపీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతుంది. అక్కడ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా ప్రవర్తించిన సీఐ అల్తాఫ్ హుస్సేన్‌కు గుంటూరులో ఎలా పోస్టింగ్ ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ విషయాన్ని పార్టీ నేతల దృష్టికి తీసుకువెళ్లారు.


studio green
STUDIO GREEN FILMS (P) LTD.
BESTEST ENTERTAINMENT
SINGLE SCREENS
RS. 99/-
@ THE BESTEST PRICE
MULTIPLEXES
RS. 125/-
K.E.GNANAVELRAJA & AADHANA GNANAVELRAJA
ALLU SIRISH'S
బడ్డీ
SAM ANTON
PRODUCED BY
KE GNANAVELRAJA
AADHANA GNANAVELRAJA
FROM TODAY
NETFLIX


TRISHA PRESENTS
నేడే బ్రహ్మాండమైన విడుదల
తిరగబడరసామీ...


VIJAYA BHASKAR KRAFT
A VIJAYA BHASKAR FILM
నేడే విడుదల
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY
VIJAYA BHASKAR K
DOP SATISH MUTYALA MUSIC RR DHRUVAN


SRI NEELAKANTA MAHADEVA ENTERTAINMENTS LLP
PVR INOX PICTURES RELEASE
నేడే విడుదల
Average Student
నాని
IN THEATRES
2
AUGUST


IN CINEMAS AUG 2nd
SVC RELEASE
అలనాటి రామచంద్రుడు
నేడే విడుదల


INFINITI FILM VENTURES
IN THEATRES
AUGUST 9TH
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
SCRIPT | DOP | DIRECTION SD VIJAY MILTON
PRODUCED BY
KAMAL BOHRA | D. LALITHAA | B.PRADEEP | PANKAJ BOHRA


MAHARSHI KONDLA PRESENTS
SINGLE SCREENS
RS 99
MULTIPLEXES
RS 112
You Are TRAPPED
VARUN SANDESH
విరాజీ
ప్రపంచవ్యాప్తంగా
ఆగస్టు 2న విడుదల
నేడే విడుదల
PRODUCER MAHENDRA NATH KONDLA DIRECTOR ADHYANTH HARSHA


MEGA BLOCKBUSTER
2ND WEEK
KALANITHI MARAN PRESENTS
DHANUSH
రాయన్
WRITTEN AND DIRECTED BY DHANUSH
AN A R RAHMAN MUSICAL
IN CINEMAS NOW

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



అన్న క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

అన్న క్యాంటీన్‌ల పనులను త్వరగా పూర్తి చేయండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఆగస్టు 1: పట్టణంలోని అన్న క్యాంటీన్ మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న అధికారులను ఆదేశించారు. స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో గురువారం అన్న క్యాంటీన్ మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్‌లోని అన్న క్యాంటీన్, చెంచుపేటలోని అన్న క్యాంటీన్‌ల మరమ్మతు పనులను ప్రారంభించామని, ఈ నెల 10వ తేదీలోపు పూర్తిచేస్తామని అన్నారు. ఈ అన్న క్యాంటీన్‌ల ద్వారా దినసరి కూలీలు, చిరుద్యోగులు, సామాన్య నిరుపేదలకు చౌక ధరలకే నాణ్యమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

పింఛన్ల పంపిణీని వేగంగా పూర్తి చేయండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఆగస్టు 1: పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని వేగంగా పూర్తిచేయాలని అధికారులను పట్టణ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆదేశించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో నెల అవ్వ తాతలకు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లను పండుగ వాతావరణంలో ఉదయం గం.6లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ అధికారులతో కలసి పంపిణీ చేశారు. స్థానిక ఆరో వార్డులో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించి అధికారులకు పలు ఆదేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు సుమారుగా 97శాతం ఫించన్లను పంపిణీ చేశామని మిగిలిన సుమారు 300మంది ఫించన్‌దారులకు రేపు పంపిణీ చేస్తామని అన్నారు. అనంతరం పలు వార్డులలో పర్యటించి ఫించన్‌ల పంపిణీని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తెనాలి తహసీల్దార్‌గా గోపాలకృష్ణ



గోపాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యాలయ సిబ్బంది

తెనాలి రూరల్, ఆగస్టు 1: తెనాలి తహసీల్దార్‌గా గోపాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. గతంలో చేబ్రోలులో పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా తెనాలికి వచ్చారు. గురువారం ఆయనను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ హెన్నా ప్రియ, ఇతర కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




ట్రస్ట్ చైర్మన్ రాంచంద్‌కు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న వెంకట్రావు

కొసరాజు, కొలసాని చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం

● రూ.10 లక్షలు విరాళం

తెనాలి అర్బన్, ఆగస్టు 1: విశ్రాంత అధ్యాపకుడు కొసరాజు వెంకట్రావు ఆధ్వర్యంలో కొసరాజు అండ్ కొలసాని చారిటబుల్ ట్రస్ట్‌ను గురువారం ప్రారంభించారు. ఏఎస్ఎన్ కళాశాలలో జరిగిన సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ, నిరుద్యోగుల ఇబ్బందులు గుర్తించామని, వారికి ఉద్యోగ అవకాశాలు అందుకునేందుకు అవసరమైన శిక్షణ ట్రస్ట్ ద్వారా కల్పిస్తామన్నారు. పేద విద్యార్థులను దత్తత తీసుకుని వారిని చదివించేందుకు కృషి చేస్తామన్నారు. తనవంతు సాయంగా రూ.10 లక్షల విరాళాన్ని ఆయన మనుమడు చైతన్య మోహన్ జ్ఞాపకార్థం విరాళాన్ని ట్రస్ట్ చైర్మన్ కొలసాని రాంచంద్‌కు అందజేశారు. ట్రస్టీలుగా కొసరాజు ఝాన్సీరాణి, కొలసాని మాధవి, చిట్టినేని సాంబశివరావు, పాపోలు వెంకటేశ్వరరావు, ఎస్‌వీ శర్మ వ్యవహరిస్తారని, కార్యదర్శిగా కొసరాజు వెంకట్రావు ఉంటారని చెప్పారు.

జీఆర్‌పీ ఎస్ఐగా వెంకటాద్రి



బాధ్యతలు చేపడుతున్న ఎస్ఐ వెంకట్రాది

తెనాలి క్రైం, ఆగస్టు 1: తెనాలి రైల్వే పోలీస్ స్టేషన్ (జీఆర్‌పీ) ఎస్ఐగా జి.వెంకటాద్రి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన సరస్వతి బాపట్ల రైల్వే స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఎస్ఐ వెంకట్రాది గతంలో గుంటూరు రైల్వేస్, తాడేపల్లి, వట్టిచెరుకూరు, తాడికొండ, చేబ్రోలు, పెదకాకాని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలపై ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేయడంతో పాటు పాత రైల్వే నేరస్తులపై నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. రైల్వే ప్రయాణికులకు భద్రతా భరోసా కల్పించడంతో పాటు స్టేషన్ పరిధిలో అసాంఘీక కార్యకలాపాలకు చోటు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెంకటాద్రి తెలిపారు.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల



చక్రాయపాలెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్, పక్కన సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

కొల్లిపర, ఆగస్టు 1: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో పెన్షన్లు పంపిణీ జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చక్రాయపాలెం, చెముడుబాడు, దావులూరు, నాగరాజుపాలెం, తూములూరు, కొల్లిపర గ్రామాల్లో మంత్రి మనోహర్ సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో కలిసి లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలు పింఛన్లు ఇప్పించాలని, రోడ్లు వేయించాలని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం వరుసగా రెండో నెల కూడా విజయవంతంగా జరిగిందన్నారు. పింఛను తీసుకుంటున్న వారు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అర్హత ఉన్న పింఛను పొందలేని వారి సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. కొల్లిపర మండలంలో 9వేల 821 పెన్షన్లకు గాను రూ.4కోట్ల5వేలు నగదు రూపంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాబోయే రెండు నెలల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు అందించడం జరుగుతుందన్నారు. గురువారం 90శాతం పింఛను పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధితో ముందుకు వెళ్తుతుందన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కొల్లిపర మండలానికి రూ.3కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించటానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే రక్షిత తాగునీటిని ఇంటింటికి అందించటానికి కుళాయిలు ఏర్పాటుకు కోటి70లక్షలు రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ మూర్తి, నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, అడపా నారాయణరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, అడపాల నాగేశ్వరరావు, యర్రు వెంకయ్య నాయుడు, దాసరి నరసయ్య, కట్టా శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేజండ్ల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

● తెనాలి రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరిట ప్రతి నెల రూ.4000 అందిస్తూ వృద్ధులకు, దివ్యాంగులకు అండగా నిలుస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని కొలకలూరు, గుడివాడ, కోపల్లె, అంగలకుదురు గ్రామాల్లో మంత్రి మనోహర్ పర్యటించి స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెనాలి నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామని అందుకు అన్ని పార్టీలు రాజకీయాలను పక్కనపెట్టి తమతో కలిసి నడవాలన్నారు. సర్పంచ్‌లు యడ్లపాటి రాకేష్, చొప్పర ప్రీతి, ఊసరపు రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్,ఎంపీడీవో కానూరు శిల్ప, కార్యదర్శులు రామసుబ్బారావు, గుర్రం ప్రసాదరరావు, ఆయా గ్రామాల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మనోహర్‌కు ఘన స్వాగతం

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి అంగలకుదురు విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్లమనోహర్‌ను గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లిమురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాలనాగభూషణంలు ఘన స్వాగతం పలికారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత నాదెండ్ల మనోహర్ తొలిసారిగా గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మురళి, నాగభూషణంలు మనోహర్‌కు గజమాలను వేసి దుశాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గణేష్‌యూత్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, ఆగస్టు 1: కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చటంలో రాజీలేకుండా పనిచేస్తుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నరేంద్ర కుమార్ లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి ఓటమి ఇంకా జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. గత వైసీపీ పాలకులు రాష్ట్రంలో విధ్వంస పాలన సాగించారని ఆరోపించారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికి చంద్రబాబుపై వ్యతిరేకత తీసుకురావటానికే బ్యాంకులలో నగదు వేసి పింఛనుదారులను ఇబ్బందులు పెట్టారని దుయ్యబట్టారు. ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పేదల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, మాదాల వెంకటేశ్వరరావు, షేక్ షఫూ, బొర్రు సాంబశివరావు తదితరులతో పాటు ఎంపీడీవో పి.రత్నజ్యోతి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● చేబ్రోలు: పేదల మోములో చిరునవ్వులు చూడటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని వేజండ్లలో గురువారం 1446 మందికి రూ.61లక్షల పింఛన్ల నగదును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పేదల ప్రభుత్వంగా తెలిపారు. వేజండ్ల అభివృద్ధికి మొదటి దశగా రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనునట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు షైల వెంకట్రామరాజు, జనసేన అధ్యక్షుడు చందు శ్రీరాములు, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోసి, మూడు పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో హర్షాతిరేకాలు



వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు

తెనాలి రూరల్, ఆగస్టు 01: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు వెల్లడించడంతో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఆనందోత్సాహాల నడుమ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలు, బీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు కృషిచేసిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రధాని నరేంద్రమోడీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగలకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు జరిపారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న బాబుజగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకంచేసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పెద్దసంఖ్యలో ఎస్సీసెల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తీర్పుపై కూటమి నేతల హర్షం

తెనాలి రూరల్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ కల సాకారం అయ్యేందుకు కృషి చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెనాలి నియోజవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు సౌపాటి కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణ బిల్లును అమోదిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ పట్టణ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కిరణ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్నామని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తమకు అనుకూలంగా తీర్పు రావడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రిజర్వేషన్ల విషయంలో తమకు ఎంతో అన్యాయం జరిగిందని ఈ తీర్పుతో న్యాయం జరగబోతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రధాని నరేంద్రమోడీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గాజులవర్తి సురేష్, పినపాటి రవీంద్ర, దొప్పలపూడి శ్యాం, బుల్లా రమేష్, రావూరి ఆనంద్, చావలి రాజేంద్రప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, వి.జాన్‌బాబు, అత్తోట శరత్, కె.మనోజ్, టి.మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఉద్యోగుల హర్షాతిరేకాలు

పెదకాకాని, ఆగస్టు 1 : షెడ్యూల్ కులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సర్వత్రా హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. గురువారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధాన గేటు ఎదుట సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు కొలికపుడి కోటేశ్వరరావు మాట్లాడుతూ 30ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇవ్వడం ఎంతో ఆనందకరమన్నారు. ఎస్సీ వర్గీకరణను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే చంద్రబాబు నాయుడు తీర్మానంచేసి అమలు చేశారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఎమ్మార్పీఎస్ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు హర్షణీయం: విజయ్

పొన్నూరు టౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం అని టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు చిలకా విజయ్ గురువారం అన్నారు. ఎస్సీ వర్గీకరణ టీడీపీతోనే సాధ్యం అన్నారు. భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వటం చారిత్రాత్మకం అన్నారు. మాదిగ దండోరా ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు నివాళులు అర్పించారు. మాదిగ దండోర ఉద్యమాన్ని స్థాపించి నేటివరకు పోరాడిన మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ ఉద్యమ నిర్మాణంలో, పోరాటాల్లో పాల్గొని ముందుకు సాగిన సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు దళితుల ఐక్యతను పెంచేలా ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి దళిత నాయకుడిపై ఉందన్నారు.

గ్రామాల అభివృద్ధికి కష్టపడి పని చేయండి: మంత్రి నాదెండ్ల



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, ఆగస్టు 1: ప్రతి ఒక్క అధికారి కష్టపడి పని చేయాల్సిందేనని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, అంగన్‌వాడీ, విద్య, వెలుగు, వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. మండలంలో చేసిన అభివృద్ధి పనులు ఏ స్థాయిలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి తమవంతు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూచుకోవాలన్నారు. పారదర్శకంగా పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా అధికారులు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. 50శాతం సబ్సిడీపై పట్టాలను ఇప్పించాలని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని కాబట్టి అందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఏవో వెంకట్రావుకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ మూర్తి, ఏపీఎం ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సెల్‌ఫోన్‌ల గుర్తింపు ప్రక్రియ: 300 సెల్‌ఫోన్‌ల రికవరీ

గుంటూరు, ఆగస్టు 1: జిల్లాలో ప్రజలు వివిధ రకాలుగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. దీనిలో భాగంగా గురువారం సుమారు రూ.45 లక్షల ఖరీదైన 300 సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయా బాధితులకు పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.3 కోట్ల 11లక్షల 40వేల ఖరీదైన 2076 వివిధ బ్రాండెడ్ కంపెనీల మొబైల్ ఫోన్లను రికవరీచేసి ప్రజలకు అందజేశామన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ అనే పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారం దుర్వినియోగం కాకుండా సెల్‌ఫోన్ బ్లాక్ అవుతుందన్నారు. అలాగే పోగొట్టుకున్న ఫోన్‌ను త్వరగా రికవరీ చేస్తామన్నారు. అలాగే ప్రజలు తమ విలువైన వస్తువులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ తీసుకున్నవారు ఎస్పీకి, నోడల్ అధికారిగా ఉన్న అడ్మిన్ అడిషనల్ ఎస్పీ రమణమూర్తికి, సోషల్ మీడియా సైబర్ సెల్ ఇన్‌చార్జ్ మౌలా షరీఫ్‌కి, ఐటీ కోర్ టీం సభ్యులకు, రికవరీ టీం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

విజయవంతంగా ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు

గుంటూరు(విద్య), ఆగస్టు 1: ప్రపంచంలోని అగ్రదేశాల సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తల సహకారంలో ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు ఆర్వీఆర్ అండ్‌జేసీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాదులో విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తదితరులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.



తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న అధికారులు

తల్లిపాలు బిడ్డకు, తల్లికి రక్షణ కవచం: సీడీపీవో

పొన్నూరు టౌన్, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు రక్షణ కవచం అని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కె శ్యామల అన్నారు. పొన్నూరు పట్టణంలో రజకపేటలో గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు అందించటం వల్ల కలిగే వ్యాధినిరోధక శక్తి, పోషకాల గురించి వివరించారు. అనంతరం వార్డులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సచివాలయ సిబ్బంది పనితీరు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆగ్రహం



సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, ఆగస్టు 1: సచివాలయ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం 6 గంటల నుంచి చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా సచివాలయ సిబ్బందికి పింఛన్ల పంపిణీ గృహాలను కేటాయించారు. మండల పరిధిలోని ములుకుదురులో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ 8 గంటలకు రాగా, అప్పటి వరకు సచివాలయ సిబ్బంది విధులోకి రాకపోవటంతో ఎంపీడీవో రత్నజ్యోతిని ప్రశ్నించారు. అయితే సచివాలయ సిబ్బంది 8 గంటల తర్వాత సమావేశం జరుగుతుండగా అక్కడి రావటం గమనించిన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పోకడలు వదిలించుకోకపోతే తీవ్ర ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. సమయపాలన పాటించకపోవటం సచివాలయంలో అందుబాటులో ఉండటం లేదని గ్రామస్థుల ఫిర్యాదుపై కూడా స్పందించి హెచ్చరించారు. అంతేకాకుండా ఆగస్టు నెల పింఛన్ల వివరాలు అందచేయాలని ఎమ్మెల్యే కోరగా మూడు నెల క్రితం పింఛన్ల జాబితాను అందించటంపై అసహనం వ్యక్తం చేశారు.



వెనిగండ్లలో ప్రీస్కూల్‌ను తనిఖీ చేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి

ప్రీస్కూల్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ తనిఖీ

గుంటూరు సిటీ, ఆగస్టు 1: గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నడపబడుతున్న ప్రీస్కూల్‌ను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ప్రీస్కూల్‌లో కేవలం 14మంది పిల్లలు మాత్రమే ఉన్నట్లు డైరెక్టర్ గుర్తించారు. హాజరు పట్టికను పరిశీలించారు. పిల్లలకు వండిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న ప్రీస్కూల్ కిట్‌పై ఆరాతీశారు. ప్రీ స్కూల్‌ల్లో హాజరు శాతం పెంచేందుకు ఏమిచేస్తే బాగుంటుందో అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో నమోదు అయిన అనుబంధ పోషక ఆహారం, టీహెచ్‌ఆర్ పంపిణీ, పోషన్ ట్రాకర్ యాప్‌లను అంగన్వాడీ కార్యకర్త చరవాణిలో పరిశీలించారు. డైరెక్టర్ వెంట సంయుక్త సంచాలకులు మనోరంజని, ఐటీ కన్సల్టెంట్ బాలరత్నాకర్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మద్దాల ఉమాదేవి తదితరులు ఉన్నారు.



స్వధార్ హోమ్‌లో ఆహారం పంపిణీచేస్తున్న మురళి, నాగభూషణం, పూర్ణచంద్ తదితరులు

సాంబశివరావు సేవలు అభినందనీయం

● గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

తెనాలి రూరల్, ఆగస్టు 1: కెన్యా దేశంలో వ్యాపారవేత్తగా అగ్రస్థానంలో ఉన్నా మాతృభూమిపై ఉన్న మమకారంతో ఇక్కడ అనేకమంది పేద విద్యార్థులకు, నిరుపేదలకు తనవంతుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ వారికి అండగా నిలుస్తున్న పమిడిముక్కల వెంకట సాంబశివరావు సేవలు అభినందనీయమని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి అన్నారు. గురువారం పమిడిముక్కల వెంకట సాంబశివరావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన మిత్రుడు కెన్యాకి చెందిన కొత్తపల్లి కృష్ణమోహన్ సహకారంతో పట్టణంలోని జేఎంజే స్వధార్ హోమ్‌లో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, ఈదర వెంకటపూర్ణచంద్‌లు పాల్గొని జన్మదిన కేక్‌ను కట్‌చేసి ఆశ్రయం పొందుతున్నవారికి ఆహారం పంపిణీచేశారు. ఈదర శ్రీనివాసరావు, కాకుమాను ఉపేంద్ర, గుమ్మడి ప్రసాద్, సుభాని, తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లెలో బోనస్ పంపిణీ చేస్తున్న సంగం డైరెక్టర్ రామారావు తదితరులు

పలు గ్రామాల్లో రైతులకు బోనస్ పంపిణీ

పొన్నూరు టౌన్, ఆగస్టు 1: పాల రైతుల శ్రేయస్సు కోసం సంగం పాలకవర్గం నిరంతరం పాటుపడుతుందని ఆ సంస్థ పాలకవర్గ సభ్యుడు బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని మునిపల్లె వెల్లలూరు, బ్రాహ్మణకోడూరు, జూపూడి, చేబ్రోలు మండలంలోని మంచాల గ్రామంలో గురువారం పాల రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. మునిపల్లెలో 68మంది రైతులకు రూ.2.15లక్షలు వెల్లలూరులో 97మందికి రూ.1.25లక్షలు, బ్రాహ్మణకోడూరులో 45మందికి రూ.40 వేలు, జూపూడిలో 33మందికి రూ.14వేలు, మంచాలలో 50మందికి రూ.96వేలు బోనస్‌ను అందించారు. కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, సూపర్‌వైజర్ సందీప్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సినీ నటుడు ఎంఎస్ నారాయణ కుమారుడికి డాక్టరేట్

పెదకాకాని, ఆగస్టు 1: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ విభాగంలో పరిశోధన చేసినందుకు ప్రముఖ సినీ నటుడు ఎంఎస్ నారాయణ కుమారుడు ఎమ్మెస్ విక్రమ్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ గురువారం తెలిపారు. ఏ స్టడీ ఆన్ చైల్డ్ లేబర్ ఇన్ రంగారెడ్డి డిస్ట్రిక్ట్ అనే అంశంపై విక్రమ్ పరిశోధన చేశారు. పరిశోధన పర్యవేక్షకులుగా అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్ కుమార్ వ్యవహరించారు. విక్రమ్ హీరోగా, నటుడిగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిస్తూనే న్యాయశాస్త్ర విభాగంలో పీజీ పూర్తిచేశారు. ప్రస్తుతం న్యాయవాద వృత్తిలో ఉంటూనే తనకు నటనపై ఉన్న ఆసక్తితో వెబ్ సిరీస్‌లలో నటిస్తున్నానని తెలిపారు.